బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 29 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## జూన్ 8, 9 తేదీల్లో చేప ప్రసాదం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూన్ 8 ,9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిన సోదరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు బత్తిని బ్రదర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. బత్తిన సోదరులు కొన్ని ఏళ్ల నుంచి అస్తమా బారిన పడ్డ వారికి చేప ప్రసాదంను పంపిణి చేస్తున్నారు. ఈ సంవత్సరం మృగశిర కార్తీ జూన్ 8 ఆదివారం ఉదయం10 గం లకు ప్రవేశిస్తుంది. ఆ రోజునే చేప ప్రసాదం పంపిణి చేస్తామని బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలియచేశారు. ఎప్పటి లానే ఈ సంవత్సరం జూన్ 8 తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మృగశిరా కార్తీ ఘడియలు ప్రవేశించిన వెంటనే చేప ప్రసాదం ఇవ్వబడుతుందని తెలిపారు. దేశ, విదేశాల నుండి లక్షలాది మంది వస్తుంటారని, అందుకోసం ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పంపిణి సజావుగా సాగడానికి మన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో సంబంధింత మంత్రులు, అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా.. హైదరాబాద్ కలెక్టర్ , డీజీపీ పోలీస్ కమిషనర్స్, అందరి సమన్వయ సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ చేప ప్రసాదానికి .. నాలుగు నుండి ఐదు లక్షల మంది రోగులు వస్తారని అంచనా వేసినట్టు తెలిపారు.జీ హెచ్ ఎం. సి. వాటర్ వర్క్స్, ఆర్టీసీ, మునిసిపాలిటీ, పోలీస్, విద్యుత్తు శాఖ తో పాటు మత్స్యశాఖా కావాల్సిన చేపల్ని సిద్ధంచేస్తున్నారని వెల్లడించారు.

### కులం వల్ల కాదు

# ఉన్నత చదువులతోనే గుర్తింపు



- విద్యార్థులంతా చదువుకుని భవిష్య త్తులో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది.
- ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు.
- ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే
- మాజీ ముఖ్యమంత్రి తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ పేదలకు మాత్రం ఇవ్వలేదు
- మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది
- ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయకుండా కుట్ర పన్నుతున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కులం వల్ల కాదు ఉన్నత చదువులతో గుర్తింపు వస్తుందన్నారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్బోధించారు.బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలోని ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీ, ఎన్ఐటీల్లాంటి ప్రఖ్యాత సంస్థల ప్రవేశాలతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డుల బహూకరణ, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలు అందించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రిముందుగా ప్రాంగణంలో విద్యార్థుల చిత్రకళా గ్యాలరీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది. గురుకులాల్లో చదువుకుంటున్న మా పిల్లలు రేపటి రోజున ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కాంక్షిస్తున్నా. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి గారి పేరును తెలుగు యూనివర్సిటీకి, మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ గారి పేరును, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ గారి పేరును.. ఇలా ఎందరో త్యాగమూర్తుల స్ఫూర్తితోనే సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. జవహర్ లాల్ నెహ్రూ గారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగిస్తున్నాం.

ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. చదువులో మరో మెట్టు ఎక్కబోతున్న విద్యార్థుల ముందు రకరకాల రంగుల ప్రపంచం ఆకర్షణీయంగా ఉంటుంది. ఊహాగానాల్లో తిరగకుండా జీవితంలో 25 సంవత్సరాలు వచ్చే వరకు కష్టపడి చదువుకుంటే ఈ సమాజంలో గౌరవంగా బతకడానికి, భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. దారితప్పితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. చదువుకుంటే గ్రామం నుంచి రాష్ట్రం వరకు గర్వంగా బతికేలా చేస్తుంది.

ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, “చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు, చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది” అని సీఎం అన్నారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలు, అసమానతలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించుకున్నామని గుర్తుచేశారు.కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే, వారు చదువుకునే పరిసరాలు, మౌలిక సదుపాయాలు కూడా అంతే ముఖ్యమని సీఎం వ్యాఖ్యానించారు. “ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు చదువులు వద్దని, వారు కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్టుగా మాజీ సీఎం వ్యవహరించారు” అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువత ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆయన విమర్శించారు. ‘

మిగితా 2వ పేజీలో

# వరి మద్దతు ధర పెంపు



- 2025-26 ఖరీఫ్‌కు 14 పంటల కనీస మద్దతు ధర పెంపు
- వరి ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 2,369కి చేరింది
- సవరించిన వడ్డీ రాయితీ పథకం కొనసాగింపునకు ఆమోదం
- నైజర్‌సీడ్‌కు అత్యధికంగా రూ. 820 పెరుగుదల
- కిసాన్ క్రెడిట్ కార్డుపై రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఖరీఫ్ సీజన్ లో వరికి రూ. 69 మద్దతు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తాజా పెంపుతో క్వింటాల్ వరి మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369 కి చేరింది. రైతులు తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను నిర్ధరించుకోవడానికి, కొత్త పంటలు వేయడానికి ముందు కేంద్ర ప్రభుత్వం ఏటా ఖరీఫ్ పంటల ఎంఎస్‌పీని సవరిస్తూ ఉంటుంది. అందులో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది.


ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు ప్రభుత్వం వరాలు ప్రకటించింది. ఎమ్మెస్పీ 50శాతం పెంచింది. కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గత పది పదకొండేళ్లలో ఖరీఫ్ పంటలకు ఎమ్మెస్పీ భారీగా పెరిగిందన్నారు. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ఎమ్మెస్పీ పెంపునకు ఆమోదం చెప్పింది.

పప్పుదినుసుల్లో కందిపప్పుపై క్వింటాలుకు రూ.450 పెంచారు. ఈ పెంపుతో క్వింటాలు కందుల ఎంఎస్పీ రూ. 8 వేలకు చేరుతుంది. పెసరపై క్వింటాలుకు రూ.86 పెంచి రూ. 8768 చేశారు. మినుములకు ఎంఎస్పీని క్వింటాలుకు రూ.400 పెంచి, రూ. 7,800 చేశారు. నూనెగింజల విషయానికొస్తే వేరుశనగ, పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటల కనీస మద్దతు ధరను వరుసగా క్వింటాలుకు రూ.480, రూ.441, రూ.436 పెంచారు. ముఖ్యంగా నైజర్ సీట్ (క్వింటాల్‌కు రూ.820), రాగి (క్వింటాకు రూ.596), పత్తి (క్వింటాకు రూ.589), నువ్వులు (క్వింటాకు రూ.579) చొప్పున నిర్ణయించింది. పత్తి కనీస మద్దతు ధర రూ.589కి పెరిగింది.

కనీస మద్దతు ధరల పెంపుతో పాటు, సవరించిన వడ్డీ రాయితీ పథకాన్ని (%వీక్షీూా%) 2025–26 ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకం కింద రైతులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ప్రస్తుతం ఉన్న 1.5% వడ్డీ రాయితీ యథాతథంగా కొనసాగుతుంది.

కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా రైతులకు సులభంగా రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కింద రైతులు రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను 7% వడ్డీకే పొందవచ్చు. ఇందులో 1.5% ప్రభుత్వం రాయితీగా భరిస్తుంది. దీంతో రుణాలిచ్చే బ్యాంకులకు, సంస్థలకు భారం తగ్గుతుంది. అంతేకాకుండా, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు అదనంగా 3% ప్రోత్సాహక రాయితీ (%ూక్కక్కీ%) లభిస్తుంది. దీనివల్ల రైతులకు కేవలం 4% వడ్డీకే రుణం అందుబాటులోకి వస్తుంది. పశుసంవర్ధక లేదా మత్స్య పరిశ్రమ కోసం రుణాలు తీసుకునే వారికి రూ. 2 లక్షల వరకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

# పంట నష్టపరిహారం నిధులు విడుదల



- రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 5,528 ఎకరాల్లో పంట నష్టం
- 41,361 మంది రైతులకు రూ.51.528 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని గత రెండు నెలలుగా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2 నెలల్లో 29 జిల్లాల్లో 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 41,361 మంది రైతులకు సంబంధించి రూ.51.528 కోట్లు విడుదల చేసింది ప్రభుత్వం. అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. చేతికి అందాల్సిన పంట నీటి పాలైంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటి పాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, పత్తి 4753 ఎకరాలు, ఇతర పంటలు 477 ఎకరాలలో నష్టం జరిగింది. దాంతో రేవంత్ ప్రభుత్వం రైతులకు ఊరటనిస్తూ పంట నష్ట పరిహారం నిధులను విడుదల చేసింది.

ఇటీవల అకాల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 29 జిల్లాల్లో 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. ఈ అంచనా నివేదిక ప్రకారం రూ.51.528 కోట్లను విడుదల చేసింది ప్రభుత్వం. ఈ పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇక, మే నెలలో జరిగిన నష్టంపైనా అధికారులు నివేదిక సమర్పించగా.. ఇందుకు సంబంధించి పంట నష్టపరిహారం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రభుత్వం ఏకకాలంలో పంటల సేకరణ కార్యకలాపాలను కొనసాగిస్తోంది. మే నెలలో అదనపు పంట నష్టాన్ని అంచనా వేయడానికి కొత్త సర్వేను కూడా ప్రారంభించింది. ఈ ఇటీవలి కాలానికి సంబంధించిన నివేదిక ఇప్పటికే సమర్పించబడింది. అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేయబడతాయని మంత్రి ధృవీకరించారు.

రైతులకు మద్దతివ్వడం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే వ్యవసాయ ఇబ్బందులను తగ్గించడంలో ప్రభుత్వం నిరంతర నిబద్ధతలో ఈ ఆర్థిక సాయం ఒక ముఖ్యమైన అడుగు అని అధికారిక ప్రకటనలో తెలిపింది.

## తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా అపరేష్ కుమార్ పేరు సిఫార్సు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



తెలంగాణహైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార?ండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార?ండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార?ండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార?ండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు.

# మహబూబ్‌నగర్‌లో ఆర్‌జీయూకేటీ క్యాంపస్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్‌లో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(RGUKT) కొత్త క్యాంపస్ ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ క్యాంపస్‌లో 2025–26 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయి. అవి: 1) ఇంటిగ్రేటెడ్ బీ.టెక్ ప్రోగ్రాం (6 సంవత్సరాలు) – ఇది రెండేళ్ల ప్రీ–యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల బీ.టెక్‌ను కలిపి ఉంటుంది. ఈ కోర్సు 10వ తరగతి మార్కుల ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు. 2) ఎం.టెక్ (2 సంవత్సరాలు) – ఇంజనీరింగ్‌లో పోస్ట్–గ్రాడ్యుయేషన్ కోర్సు, దీనికి GATE స్కోర్ ఆధారంగా అడ్మిషన్ ఉంటుంది. 3) పీహెచ్‌డీ ప్రోగ్రామ్ – ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇతర ఇంజనీరింగ్ రంగాల్లో పరిశోధన కోసం ఈ కోర్సు ప్రారంభిస్తారు. ఈ క్యాంపస్‌లో అడ్మిషన్లు, ఫీజు వివరాలు, ఇతర సమాచారం త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో www.rgukt.ac.in అందుబాటులో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రపంచ స్థాయి టెక్నాలజీ కోర్సులు అందించేందుకు RGUKTలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆర్థికంగా వెనుకబడిన, సామాజికంగా బలహీన వర్గాల విద్యార్థులకు ఉత్తమ టెక్ కోర్సులు అందించడమే RGUKTల లక్ష్యం. 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు www.rgukt.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.




### ఆర్జీయూకేటీ బాసర అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ట్రిపుల్‌ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు బాసర ఆర్‌జీయూకేటీ అడ్మిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ట్రిపుల్‌ఐటీల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చు.బుధవారం (మే 28) ఆర్జీయూకేటీ బాసర అడ్మిషన్ నోటిఫికేషన్ ను వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విడుదల చేశారు.

మిగితా 2వ పేజీలో

# టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు

- మరో సారి ఏకగ్రీవంగా ఎన్నిక


బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడిగా నారా చంద్రబాబునాయుడు మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం కడప జిల్లాలో మహానాడు వేదికపై ఆ పార్టీ ఎన్నికల కమిటీ చైర్మెన్ వర్ల రామయ్య ప్రకటించారు. అనంతరం చంద్రబాబు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఏపీతోపాటు తెలంగాణ పార్టీ నేతలు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. 1995లో తొలిసారిగా చంద్రబాబు పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. గత 30 ఏండ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. టీడీపీలో ప్రతి రెండేండ్లకోసారి అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ పార్టీని సమర్థవంతంగా నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. “ నా ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. తెలుగు జాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది నా బలం, బలగం టీడీపీనే. నాపై కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మహానాడులో ఆరు శాసనాలపై అర్థవంతంగా చర్చలు జరిగాయి. వచ్చే 40 ఏండ్లకు ప్రణాళిక రచించుకు న్నాం. రాయలసీమలో ఫ్యాక్షనిజం తుదముట్టించి అభివృద్ధికి బాటలు పరిచాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు. రత్నాల సీమగా మారుస్తామని చెప్పాం. కోనసీమ కంటే సంపదలో అనంతపురం ముందుండటానికి టీడీపీనే కారణం. హైదరాబాద్‌లో మత ఘర్షణలను పూర్తిగా కట్టడి చేశాం. టీడీపీ అధికారంలో ఉంటే అందరికీ రక్షణ ఉంటుంది”..అని చంద్రబాబు అన్నారు.

# రాజ్యసభకు కమల్‌హాసన్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎమ్) పార్టీ అధినేత , ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంఎన్‌ఎంకు ఎగువసభ స్థానం కేటాయిం చారు. ఈ విషయాన్ని డీఎంకేఎంఎన్‌ఎం ఖరారు చేశాయి. ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్, ఎం.షణ్ముగమ్, ఎన్. చంద్రశేగరన్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, పి. విల్సన్, వైగో ఎగువసభ పదవీ కాలం జులై 25తో ముగిసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దాంతో నాలుగు స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. విపక్ష ఇండియా కూటమిలో ఎంఎన్‌ఎం భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే , కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రం లోని 39 లోక్‌సభ స్థానాలు , పుదుచ్చేరి లోని ఒక స్థానంలో ఎంఎన్‌ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువ సభ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వం లోని కూటమి అంగీకరించింది. ఆయన 2018లో ఎంఎన్‌ఎం పార్టీని స్థాపించారు. అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామాల సాధికారత కోసం దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## ప్రభుత్వాస్పత్రిలో భద్రాద్రి కలెక్టర్ సతీమణి ప్రసవం
## సర్కారు దవాఖానాల్లోనే చికిత్స చేయించుకోవాలి : కలెక్టర్

వివరాలు 2వ పేజీలో

# మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్‌ఏ నివేదిక బూటకమని తేలింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

'కేసీఆర్ పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం అత్యంత దుర్మార్గం' అని కేటీఆర్ మండిపడ్డారు.

'నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్ –బీజేపీ, ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల

మిగితా 2వ పేజీలో

# 299 మంది చిన్నారులపై లైంగికదాడులు

## ఫ్రాన్స్ వైద్యుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



**బలగం టీవి, హైదరాబాద్**

ఫ్రాన్స్‌లో వైద్య వృత్తికే తలవంపులు తెచ్చిన దారుణ ఘటన ఇది. వైద్యుడి ముసుగులో ఓ కామాంధుడు దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు సాగించిన అరాచకాలు ఆలస్యంగా వెలుగుచూశాయి. వందలాది మంది చిన్నారులు అతడి బాధితులు కావడం గమనార్హం. వారిపై లైంగిక దాడులకు పాల్పడిన 74 ఏళ్ల మాజీ సర్జన్ జోయెల్ లె స్కార్నెక్‌కు స్థానిక న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. తన నేరాలన్నింటినీ అంగీకరించిన ఈ దుర్మార్గుడు, ఇప్పటికే మరో కేసులో 15 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. 1989 నుంచి 2014 మధ్య కాలంలో లె స్కార్నెక్ ఈ ఘోరాలకు పాల్పడినట్లు తేలింది. తన పైశాచిక కృత్యాలన్నింటినీ ఓ డైరీలో వివరంగా రాసుకోవడమే కాకుండా, బాధితుల పేర్లను కూడా నమోదు చేయడం విచారణలో కీలక సాక్ష్యంగా మారింది. 2017లో ఓ పొరుగింటి ఆరేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుతో ఈ పాపాల పుట్ట పగిలింది. అధికారులు జరిపిన సోదాల్లో లక్షలాది అసభ్యకర ఫోటోలు, వీడియోలు, నేరాల చిట్టా ఉన్న నోట్‌బుక్స్ లభించాయి. సుమారు 299 మంది బాధితులను గుర్తించగా, వారిలో 158 మంది బాలురు, 141 మంది బాలికలు ఉన్నారు. వైద్యం పేరుతో చిన్నారులను ఒంటరిగా ఉన్నప్పుడు లేదా వైద్యం తర్వాత స్పృహలో లేనప్పుడు లక్ష్యంగా చేసుకునేవాడని తేలింది.

విచారణ సమయంలో లె స్కార్నెక్ ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా, నిర్వికారంగా కనిపించడం గమనార్హం. "నేను వారిని వ్యక్తులుగా చూడలేదు. వారు నా లైంగిక వాంఛలకు (ఫాంటసీలకు) లక్ష్యాలు మాత్రమే" అని కోర్టుకు చెప్పడం అతని వికృత మనస్తత్వానికి అద్దం పడుతుంది. తన మనవరాలిపై, ఐదేళ్ల మేనకోడలిపై కూడా అత్యాచారం చేసినట్లు ఈ నీచుడు అంగీకరించాడు. ఈ కేసు ఫ్రాన్స్ అధికార యంత్రాంగం వైఫల్యాన్ని కూడా ఎత్తిచూపింది. 2005లోనే చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులో దోషిగా తేలినప్పటికీ, లె స్కార్నెక్ వైద్య వృత్తిని కొనసాగించడంపై ప్రాసిక్యూటర్ స్టెఫాన్ కెల్లెన్‌బెర్గర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తెల్లకోటులో ఉన్న దెయ్యం"గా అభివర్ణిస్తూ, వ్యవస్థ నిర్లక్ష్యం కూడా ఈ నేరాలకు కారణమని ఆయన వాదించారు. దోషిగా తేలిన వ్యక్తిని వైద్య వృత్తిలో కొనసాగించడం, ముఖ్యంగా చిన్నారులకు చికిత్స చేసేందుకు అనుమతించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఫ్రాన్స్ చరిత్రలోనే అతిపెద్ద బాలల లైంగిక వేధింపుల కేసుల్లో ఒకటిగా నిలిచిన ఈ ఉదంతం, సమాజంలో వైద్యులపై ఉన్న నమ్మకాన్ని ప్రశ్నార్థకం చేసింది. బాధితుల ఆవేదన, నిందితుడి నిర్లజ్జ నేరారోపణ అంగీకారం సభ్యసమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

## చండీగఢ్‌లో కరోనాతో ఒకరు మృతి..

**బలగం టీవి, హైదరాబాద్**

చండీగఢ్‌లో కరోనా వైరస్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. చండీగఢ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని సెక్టార్-32లో బుధవారం 40 సంవత్సరాల వ్యక్తి కొవిడ్ బారినపడి చనిపోయాడని ఓ అధికారి తెలిపారు. జీఎంసీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ జీపీ థామి ధ్రువీకరించారు. రోగిని లూథియానా నుంచి రిఫర్ చేశారని.. రెండురోజుల కిందట శ్వాసకోశ సమస్యలతో ఆసుపత్రిలో చేరాడని.. మంగళవారం పరీక్షలు చేయగా కొవిడ్ పాజిటివ్‌గా తేలిందన్నారు. బుధవారం సదరు వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్నారు.

# కులం వల్ల కాదు ఉన్నత చదువులతోనే గుర్తింపు

**(మొదటి పేజీ తరువాయి)**

'మాజీ ముఖ్యమంత్రి తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ, ఇంకా లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. "నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్టుగా కేసులు వేస్తున్నారు. ఆరు నెలలు కూడా విరామం లేకుండా వాళ్ల ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారు. విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు

దక్కకుండా చేస్తున్నారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం. ఆ కోవలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా, రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత బిడ్డలు ఈ పదవులు చేపట్టారంటే వారికి కేవలం కులంతోనే అవకాశాలు రాలేదు. వారు ఉన్నత స్థాయిలో చదువుకుంటే వచ్చాయి. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి. ఆ లక్ష్యంతోనే రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడున్న గురుకుల పిల్లల్లో ప్రతిభ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా రాణించగలుగుతారన్న నమ్మకం నాకుంది. కుటుం బానికే కాకుండా గ్రామానికి, దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తారు.

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించే వాడిని. కష్టపడి చదివితే రాణిస్తారు. మీరు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నా. మీకెప్పుడూ తోడుగా ఉంటా. భవిష్యత్తులో రాణించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా..." అని ముఖ్యమంత్రి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

# ఆర్జీయూకేటీ బాసర అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ కార్యక్రమంలో ఓయస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ డాక్టర్ దేవరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ విటల్, మంతపురి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. 2008లో ప్రారంభించిన గ్రామీణ పేద విద్యార్థులకోసం ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. తదనుగుణంగా ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని వీసీ తెలిపారు. నోటిఫికేషన్ వివరాలకొరకు www.rgukt.ac.in వెబ్ సైట్ ను సందర్శించాలని కోరారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ప్రవేశ షెడ్యూల్‌తో పాటు ఇతర వివరాలను అందులో వెల్లడించనున్నారు. తెలంగాణలో 10వ తరగతి పాసైన విద్యార్థులకు ఇది మంచి అవకాశం. గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి పాసైన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ ముగిశాక కౌన్సెలింగ్‌కు

# మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ నివేదిక బూటకమని తేలింది

**(మొదటి పేజీ తరువాయి)**

నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో.. దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు

కాంగ్రెస్ -బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అని కేటీఆర్ అన్నారు. జై కిసాన్.. జై కాళేశ్వరం.. జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.

# తక్షణమే ఆ అధికారిని తప్పించాలి

- **ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారు అని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీగా ఏర్పడి క్వాలిటీ చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ ( శ్రమను గౌరవించడం) నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు. దీంతో పాటు 240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు. పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించవలసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను, తక్షణమే ఆ అధికారిని తప్పించాలి, నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



## ప్రభుత్వాస్పత్రిలో భద్రాద్రి కలెక్టర్ సతీమణి ప్రసవం

**బలగం టీవి, హైదరాబాద్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యంపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రజలకు నమ్మకాన్ని పెంచారు. పాల్వంచలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఆయన సతీమణి శ్రద్ధ జితేష్ పాటిల్ ప్రసవించారు. చాలాకాలంగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ సతీమణి బుధవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో తన భార్య శుద్ధ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని కోరారు. శ్రద్ధకు వైద్యం అందించిన వైద్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**-ఇప్పటిదాకా 2,49,372మెట్రిక్ టన్నుల సేకరణ**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించి దాన్యం కొనుగోలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని,ఈ నెల 28-5-2025 వరకు జిల్లాలోని 37,223 మంది రైతుల నుంచి రూ.578 కోట్ల విలువైన 2,49,372మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేశామనిఅన్నారు. వీటిలో 2,16,258 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు ఆన్లైన్ చేశామని, 34,479 మంది రైతుల ఖాతాలో 447 కోట్ల రూపాయలు జమ అయ్యాయనిఅన్నారు. మిగతా రైతుల బ్యాంకు ఖాతాలో త్వరలో డబ్బులు జమ కానున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణ తుది దశకు వచ్చిందని, జిల్లాలోని 133 కొనుగోలు కేంద్రాలను మూసి వేసినామని,చివరి గింజ వరకు దాన్యం సేకరిస్తామని,రైతులెవరూ ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యం సైతం సేకరిస్తామని స్పష్టం చేశారు.

గత మూడు రబీ సీజన్ లలో ధాన్యం సేకరణ వివరాలు..

రబీ సీజన్ (2022- 2023) 28-05౹2023 రోజు వరకు జిల్లాలో 1,64,044 మెట్రిక్ టన్నుల ధాన్యం..


రబీ సీజన్ (2023- 2024) 28-05-2024 రోజు వరకు 2,49,514 మెట్రిక్ టన్నుల ధాన్యం..

ఈ రబీ సీజన్ (2024- 2025) 28- 05-2025 ఈ రోజు వరకు 2,49,372 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు.

# పెట్టుబడి లేని పేదలకు ఎస్‌హెచ్‌జీ ద్వారా రూ. లక్ష రుణం..

**-30 రోజులలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ, బోయిన్ పల్లి**

ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు 30 రోజుల లోగా తప్పనిసరిగా ప్రారంభించాలని, పెట్టుబడి లేని నిరుపేదలకు స్వయం మహిళ సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం మంజూరు చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్ధిదారులకు సూచించారు.బుధవారం బోయిన్ పల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ లో రెండో విడత క్రింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ బోయిన్ పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో పైలెట్ గ్రామం గా ఎంపిక చేసుకొని మొదటి విడత క్రింద 109 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయగా, నేడు 50 శాతం వరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందని అన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి నేడు ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని, వీరు కూడా ఇంటి నిర్మాణం పనులు 30 రోజుల లోగా తప్పనిసరిగా ప్రారంభించాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగులు లో మాత్రమే నిర్మించాలనో అన్నారు. జిల్లాలో 40 వేల మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, నిరు పేదలకు ముందుగా మంజూరు చేయాలని ప్రభుత్వం సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక చేశామని, 3 నెలల వ్యవధిలో ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి చేసుకొని రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. 30 రోజుల లోగా ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని,ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.

నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ లబ్ధిదారులు నాణ్యమైన ఇంటిని నిర్మించుకోవాలని, సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని పిలుపునిచ్చారు.

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సోంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి బోయిన్ పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పని తీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. బోయినపల్లి మండలంలో ఇటీవల పేద మహిళ ఇళ్ళు కాలిపోతే సాయంత్రం వరకు 50 వేల రూపాయల ప్రభుత్వ సహాయంగా చెక్కు మంజూరు చేశారని, నీరోజపల్లి గ్రామంలో కూడా విద్యుత్ షాక్ తో మరణిస్తే ఆ కుటుంబానికి కూడా కలెక్టర్ సహకరించారని, మానవీయ కోణంతో పని చేస్తున్న కలెక్టర్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మిడ్ మానేరు బాధితులకు న్యాయం చేయడం కోసం త్వరలో అదనంగా మరో 1000 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. బోయినపల్లి మండలంలో 4153 రైతులకు 36 కోట్ల 63 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, గతంలో కేవలం 13 కోట్ల మాత్రమే జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల, ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళలకు వడ్డి లేని రుణాలు, 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 12 వేల 600 కోట్లతో 2 లక్షల 10 వేల ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూముల అభివృద్ధి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రోటో కాల్ కోసం ప్రశ్నిస్తే ప్రత్యక్ష దాడులు చేస్తారా’



**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

సిరిసిల్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫోటో లేకుండా అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న అధికారులను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, కాంగ్రెస్ నేతలు ప్రత్యక్ష దాడులు చేస్తూ,ప్రెస్ మీట్ లు పెట్టి బెదిరిస్తున్నారని బిఅర్ ఎస్ పార్టీ తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు గజ బింకార్ రాజన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోబింకార్ రాజన్న మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ప్రోటోకాల్ పాటించాలని అడిగితే, జంకుతున్నారని, ప్రోటోకాల్ పాటించని అధికారులు, ప్రభుత్వం ను ప్రశ్నిస్తామన్నారు.ప్రోటో కాల్ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు , సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రేవంత్ రెడ్డి ఫోటో పెడతామని హంగామా చేశారన్నారని అన్నారు.పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి, టిఆర్ఎస్ నేతలని టార్గెట్ చేస్తూ లార్డ్ చార్జి చేశారని ఆరోపించారు. లాఠీ చార్జీలో టిఆర్ఎస్ నేతలు గాయపడ్డారని పేర్కొన్నారు. ప్రజలనుంచి కాంగ్రెస్ నాయకుల తీరుపై వ్యతిరేకత రావడంతో, కాంగ్రెస్ నేతలు ప్రెస్ మీట్ పెట్టి ప్రత్యక్ష దాడులు చేస్తామని మాట్లాడడం సరైనది కాదన్నారు. అధికార పార్టీ నేతలు ప్రెస్ మీట్ లు పెట్టి పెట్టి దాడులు చేస్తామంటే, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై చర్యలు ఉండవా ? అని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం ఫోటో కాల్ పాటించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల అమలు చేయకుండా, డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు.. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రేవంత్ రెడ్డి ఫోటో పెట్టు మంటున్న కాంగ్రెస్ నేతలు, తమ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రుల ఇండ్ల లో ,క్యాంప్ ఆఫీసులలో ఫోటోలు కూడా పెట్టుకోలెని నాయకులు ఉన్నారని , ముందుగా అక్కడ పెట్టాలా చూసుకోవాలని హితువు పలికారు. రాహుల్ గాంధీ కార్యాలయంలో మోడీ ఫోటో ఉన్నదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని, ప్రజా సమస్యలు పరిష్కరించేలా చూడాలని సూచించారు.. ఈ సమావేశం లో మాజీ ఎంపీపీ పడి గెల మానస, వళ్లకొండ వేణుగోపాల్ రావు,పడి గెల రాజు, ఉమ్మారెడ్డి సత్యనారాయణ రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, కే టీ అర్ సేనా మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్, అవధూత మహేందర్, కర్నె బాలయ్య, కొయ్యడ రమేష్, బండి జగన్, సిలివే రీ చిరంజీవి, ఏ సి రెడ్డి రాంరెడ్డి, బండి దేవేందర్ యాదవ్, మోతే మహేష్ యాదవ్,కుర్మా రాజయ్య, గోడిసెల ఎల్లయ్య, అమర్ రావు, నవీన్ రెడ్డి, గుండు ప్రేమ్ కుమార్, అమర్ రావు, విజయ్, కిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి,కొమురయ్య, తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన చల్మెడ..



**బలగం టీవీ, మేడిపల్లి**

మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామ శాఖ అధ్యక్షుడు నూతి చిన్న భూమయ్య గారి కూతురు రమ– రాజశేఖర్ రిసెప్షన్ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ రమేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి, అజిత్ రావు, మకిలి దాసు, నెల్లుట్ల ప్రభాకర్, లక్ష్మిరాజం, తిరుపతి రెడ్డి, గంగారెడ్డి, అహ్మద్, దేశవేని కృష్ణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బురదమయమైన రాజన్న ఆలయ గోశాల

- **గోవులకు దాతలు అందించిన గడ్డి సైతం వర్షంలోనే తడుస్తున్న దుస్థితి..**
- **గోవుల అవస్థలు, దాతల గడ్డి వృథా..**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి తిప్పాపూర్‌లోని రాజన్న ఆలయ గోశాల దారుణంగా మారిపోయింది. గోశాల పూర్తిగా బురదమయం కావడంతో అక్కడి గోవులు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. బురదలో మగ్గిపోతూ వాటి ఆరోగ్యం దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవులకు దాతలు అందించిన గడ్డి సైతం వర్షంలోనే తడుస్తున్న దుస్థితి ఉంది. గోశాలలో పనిచేసే సిబ్బందికి సైతం బురదలో నడవడం కష్టంగా మారింది. దీంతో గోవుల సంరక్షణ మరింత భారంగా తయారైంది. గోవుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, గోశాల సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.



## రాజన్న గోశాలపై అధికారుల నిర్లక్ష్యం

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్ అన్నారు. బుధవారం వేములవాడ తిప్పాపూర్ గోశాలను ఎర్రం మహేష్ సందర్శించారు. మంగళవారం కురిసిన వర్షానికి దాతలు ఇచ్చిన గడ్డి పూర్తిగా తడిసిపోయిందని, గోశాల సిబ్బంది కనీసం గడ్డిపై ఎలాంటి పరదాలు కూడా కప్పకుండా చోద్యం చూస్తున్నారని, దాతలు ఇచ్చిన గడ్డిని నీటి పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం..

**-యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు పై వేములవాడ యూత్ కాంగ్రెస్ నేతల హర్షం**

**బలగం టీవీ, వేములవాడ**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వేములవాడ కు మంజూరు చేసిన సందర్భంగా వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ న్యాత నవీన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను వేములవాడకు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముందుకు వెళ్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ నాయకులు,యువకుల, విద్యార్థుల కృషి చేస్తామన్నారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు చిట్ల శీను, జిల్లా జనరల్ సెక్రెటరీ నాగం మురళి, నియోజకవర్గం మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ఎన్నారం సాగర్, కోనరావుపేట మండల అధ్యక్షుడు బండి ప్రభాకర్, రూలర్ మండల అధ్యక్షుడు రోమల ప్రవీణ్, టౌన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, గోపి గౌడ్, నక్క సాయి, దయ్యాల జాన్, అక్కి సునీల్, షేక్ ఇర్ఫాన్, సందేల శశి, మల్లారం రాజేందర్, దినేష్ గౌడ్, శేఖర్, వంశీ, మ్యాదరి జాన్సన్, రోహిత్, నాగుల ప్రవీణ్, అశోక్, చింతల్ విక్రమ్, కాసర్ల భాస్కర్, వేణు, పెంటా అక్షయ్, అజయ్, ప్రవీణ్, అన్వర్ పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు..



# లక్నో జట్టు ఆటగాళ్లకు జరిమానా

- స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్ పంత్‌కు రూ. 30 లక్షలు ఫైన్
- ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ. 12 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 50 శాతం

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో మంగళవారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య కీలక మ్యాచ్ జరిగింది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఆర్సీబీ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే అసలే ఓటమి బాధలో ఉన్న లక్నో జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ భారీ షాక్ ఇచ్చింది. కెప్టెన్ రిషబ్ పంత్‌తో పాటు ఆ జట్టు ఆటగాళ్లకు భారీ జరిమానా విధించింది. ఆర్సీబీతో మ్యాచ్‌లో లక్నో జట్టు స్లో ఓవర్ రేటును నమోదు చేసింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు ఇలా ఇది చేయడం ఇది మూడోసారి. పదే పదే స్లో ఓవర్ రేటును నమోదు చేయడంతో లక్నో జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ కు రూ.30లక్షల ఫైన్ వేశారు. అలాగే ఇంపాక్ట్ ప్లేయర్ సహా తుది జట్టులోకి ఆటగాళ్ల ఒక్కొక్కరికి రూ.12లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 50 శాతం రెండింటిలో ఏదీ తక్కువ అయితే జరిమానాగా విధించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.



# కన్నప్ప నుంచి 'శ్రీకాళహస్తి' పాట విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

మంచు విష్ణు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం జూన్ 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఈ సినిమాలో నుండి "శ్రీకాళహస్తి" అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ భక్తి గీతానికి ఒక ప్రత్యేక ఆకర్షణ తోడైంది. మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఈ పాటను ఆలపించారు. వారి గాత్రం ఈ పాటకు మరింత ఆధ్యాత్మికతను జోడించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. స్టీఫెన్ దేవస్సీ ఈ పాటకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఈ ఆధ్యాత్మిక గీతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటూ, సినిమాపై అంచనాలను పెంచుతోంది. ముకేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ మరియు అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మించారు. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ చిత్రంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, మంచు మోహన్ బాబు, మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్, శరత్‌కుమార్, అర్పిత్ రంకా, ప్రీతి ముఖుందన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# సుప్రీంకోర్టుకు మంచు విష్ణు

**బలగం టీవి, హైదరాబాద్**



సినీ నటుడు మంచు విష్ణు తనపై 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో నమోదైన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసును రద్దు చేయాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. 2019 సాధారణ ఎన్నికల సందర్భంగా మంచు విష్ణు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఈ ఆరోపణల నుంచి తనను విముక్తుడిని చేయాలని అభ్యర్థిస్తూ మంచు విష్ణు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై ప్రాథమిక విచారణ జరిపింది. అనంతరం, ఈ కేసుకు సంబంధించి ప్రతివాదులుగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో తదుపరి విచారణను జులై 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ఆ రోజున జరిగే విచారణలో కేసు పూర్తి వివరాలు, సమర్పించిన ఆధారాలు, ప్రతివాదుల వాదనలను న్యాయస్థానం పరిశీలించే అవకాశం ఉంది.

# ఆసక్తికరంగా మిరాయ్ టీజర్

- విలన్‌గా కనిపించబోతున్న మంచు మనోజ్
- సెప్టెంబర్ 5న మూవీ రిలీజ్




**బలగం టీవి, హైదరాబాద్**

హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మిరాయ్. మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, మైథాలాజికల్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్–అడ్వెంచర్‌గా రాబోతుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ మూవీని పాన్ ఇండియా రేంజ్ లో 2025 సెప్టెంబర్ 5న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**టీజర్ ఎలా ఉందంటే..?**

జరగబోయేది మారణ హోమం... శిథిలం కాబోతుంది అశోకుడి ఆశయం... అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో టీజర్ ప్రారంభమవుతోంది. ఆ తర్వాత మంచు మనోజ్ ఎంట్రీ అదరగొట్టారు. ఇక హీరో తేజా సజ్జా మరోసారి ప్రామిసింగ్ యాక్టింగ్ తో కష్టపడ్డారు. గ్రాఫిక్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండటంతో ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. అంతే కాకుండా ముఖ్యపాత్రల్లో జగపతిబాబు, శ్రియా శరణ్, జయరామ్ కనిపించి మెప్పించారు. హీరోయిన్‌గా రితికా నాయక్ నటిస్తోంది. అలానే టీజర్ క్లైమాక్స్ లో వచ్చే సీన్ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు, భారీ విజువల్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'మిరాయ్' సినిమా సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో, 2డీ మరియు 3డీ ఫార్మాట్లలో విడుదల కానుంది.



# ముంబైలో ఓజీ షూటింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్‌ను పూర్తి చేశారు. ఈ మూవీ అన్ని పనులు పూర్తి చేసుకుని జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక మరో మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ 'ఓజీ'.ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, వీడియో సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం 'ఓజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇది చివరి దశకు చేరుకుంది. కొన్ని సన్నివేశాలు పవన్ పై చిత్రీకరించి షూటింగ్‌ను క్లోజ్ చేయనున్నారు. ఇందులో భాగంగానే తాజా షూటింగ్‌లో పవన్ పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో జరుగుతోంది. దీంతో ముంబయి వీధుల్లో పవన్ సందడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. యువ దర్శకుడు సుజిత్ తెరకెక్కిస్తున్న ఓజీలో పవన్ సరసన హీరోయిన్‌గా ప్రియాంక మోహన్ నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను దసరా కానుకగా సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నట్లు ఇటీవలే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.



# ఎన్టీఆర్‌కు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ నివాళ్లు

**బలగం టీవి, హైదరాబాద్**

విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ ఎన్టీఆర్ ఘాట్‌కి వెళ్లి నివాళులు అర్పించారు. పుష్పగుచ్ఛాన్ని ఉంచి, నమస్కరించి నివాళి అర్పించారు. అనంతరం ఘాట్ వద్ద కాసేపు కూర్చుని తాత చేసిన సేవలని వారు గుర్తు చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది తాత జయంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ కలిసి ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వెళ్లి నివాళులు అర్పిస్తూ ఉంటారు. ఆ సమయంలో అభిమానులు కూడా భారీ ఎత్తున అక్కడికి చేరుకుంటారు.

# హరిహర వీరమల్లు నుంచి తారా తారా పాట విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన తాజా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచరస్ నుంచి మరో పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. 'తార తార నా కళ్లు.. వెన్నెల పూత నా ఒళ్లు' అంటూ సాగే ఈ పాటకు శ్రీహర్ష లిరిక్స్ అందించగా... లిప్సిక, ఆదిత్య అయ్యంగార్ ఆలపించారు. నిధి అగర్వాల్ తన అందాలతో ఆకట్టుకుంది.హరిహర వీరమల్లు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.ఆస్కార్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి స్వరాలు సమకూర్చారు. జూన్ 12వ తేదీన మూవీ రిలీజ్ కానుండగా, ప్రమోషన్స్‌ను

# దిల్ రాజుపై డిస్ట్రిబ్యూటర్ విమర్శలు

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్ లో థియేటర్ల బంద్ ప్రకటనకు నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డే అని డిస్ట్రిబ్యూటర్ అనుశ్రీ సత్యనారాయణ ఆరోపించారు. అయితే థియేటర్ల బంద్ వెనుక సత్యనారాయణ ఉన్నట్లు ఆరోపణలు రావడంతో జనసేన ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "జూన్ 1న థియేటర్ల బంద్ అని ప్రకటించింది దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డి. తమ్ముడుని కాపాడుకోవడానికి దిల్ రాజు నాపై అభాండం వేశారు. కమల్ హాసన్‌ను మించి ఆస్కార్ రేంజ్‌లో దిల్ రాజు నటించాడు. దురుద్దేశంతోనే నా పేరు చెప్పారు. పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇవ్వడంతో దిల్ రాజు జనసేన పేరు ఎత్తారు. నేను థియేటర్ల బంద్ అని ఎక్కడా అనలేదు" అని తెలిపారు. సినిమాలు లేకపోవడం వల్ల థియేటర్లు మూతపడే పరిస్థితి వస్తుందని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మాత్రమే చెప్పానన్నారు.